క్లుప్తంగా

11న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుకున్న ఐదు మోటారు వాహనాలకు ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు 91777 44055 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఏకగ్రీవంగా కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా ప్యాకర్స్, మూవర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక మంగళవారం మోరంపూడిలోని సంఘ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా నరవ గోపాలకృష్ణ, గౌరవ సలహాదారులుగా లంక సత్యనారాయణ, కేవీఎల్ నరసింహారెడ్డి, వైకేఎల్, అధ్యక్షుడిగా ఏలుపూరి కృష్ణార్జునరావు, సెక్రటరీగా గంజి ప్రకాశరావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఘంటసాల అశ్విని కుమార్, జాయింట్ సెక్రటరీగా శివ, ట్రెజరర్‌గా విశ్వనాథ్‌రాజ్, మెంబర్లుగా నాగేశ్వరరావు, అప్పారావు, సత్యనారాయణ, సునీల్ ఎన్నికయ్యారు.

పాఠశాల రికార్డులు అప్‌డేట్‌గా ఉండాలి

కంబాలచెరువు: నగరంలో పాఠశాలలను మండల స్థాయి పర్యవేక్షక బృందాలు సందర్శిస్తున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు రికార్డులన్నీ అప్‌డేట్‌గా ఉంచాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ఆదేశించారు. స్థానిక డీఎమ్‌హెచ్ స్కూల్లోని రికార్డులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ 3 పరీక్షల జవాబు పత్రాలు, విద్యార్థుల నోట్స్ కరెక్షన్స్, ప్రాథమికస్థాయిలో విద్యార్థుల వర్క్‌బుక్స్‌ని పరిశీలిస్తున్నట్టు డీఐ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. రాజాప్రశాంత్ పర్యవేక్షక బృందానికి రికార్డ్ చూపించారు. బృంద సభ్యులు వైవీ.రామారావు, టి.చక్రధర్, ఆర్ఎస్.సీతామహాలక్ష్మి రికార్డు పరిశీలించి సూచనలు చేశారు. సీఆర్పీ జయంతి శాస్త్రి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ థీమ్‌తో ఈ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ రమణమ్మ మాట్లాడుతూ ఫేస్‌బుక్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాలలో ఏర్పడిన పరిచయాలతో యువతులు ఎక్కువగా మోసపోతున్నారన్నారు. వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ అసోసియేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, డాక్టర్ ఎం.సునీత, కె.రమాదేవి, డీవీకేఎస్ లక్ష్మి, ఎస్.లక్ష్మి, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ బి.విజయ భారతలక్ష్మి పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా

ప్రకాశం నగర్: పాలకొల్లులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటినట్లు కరాటే అసోసియేషన్ సభ్యులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ విభాగంలో సీహెచ్ కార్తీక్ సాయి హర్ష బంగారు పతకం, ఎస్‌డీ ఐష వెండి పతకం సాధించారన్నారు. స్పేరింగ్ విభాగంలో సీహెచ్ మోక్షిత, పి.పూజ, ఎస్.మనోహర్ సాయిదుర్గ బంగారు పతకాలు సాధించగా, కె.సత్య వెండి పతకం సాధించిందన్నారు. మాస్టర్ పిల్లా అరుణ్ కుమార్‌ను పలువురు అభినందించారన్నారు.

ఉత్సాహంగా హోలీ



హోలీ సంబరాలు జరుపుకొంటున్న దృశ్యం

సీటీఆర్ఐ: అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం హోలీ వైభవంగా నిర్వహించారు. స్థానిక మోడల్ కాలనీలో మహిళలు, యువత కేరింతలు కొడుతూ ఒకరిపై ఒకరిపై రంగులు చల్లుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్ సింఘానియా మాట్లాడుతూ హోలి పండగను 20 ఏళ్లుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జైకిషన్ సింఘీనియా, అజయ్ పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం

సీటీఆర్ఐ: ఆంధ్ర గ్రంథాలయ ఉద్యమ శిల్పి పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య సేవలు చిరస్మరణీయమని విశ్రాంత ఎల్ఐసీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అడవి శివరాం కొనియాడారు. మంగళవారం స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో వెంకట రమణయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్ ప్రసాద్, మారిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

వనితాలోకం.. స్ఫూర్తిదాయకం

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. మగవారితో పోటీ పడుతూ విభిన్న రంగాల్లో రాణిస్తూ జీవనం సాగిస్తున్నారు. జీవితంలో ఎత్తుపల్లాలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని ముందుకు సాగుతున్నారు. తమ కుటుంబానికి అండగా నిలుస్తూ.. పలువురికి ఆదర్శప్రాయంగా మారుతున్నారు. నేడు మహిళా దినోత్సవం. ఈ సందర్భంగా ఈ కథనం..

50 ఏళ్లుగా అమ్మవారి సేవలో..



అమ్మవారికి హారతి ఇస్తున్న ఆసాది సాయిలక్ష్మి


ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోటలోని కన్నమ్మ పేరంటాలు దేవస్థానంలో 50 ఏళ్లుగా వంశపారంపర్యంగా వస్తున్న ఆసాది (పూజారమ్మ)గా శీరపు సాయిలక్ష్మి విధులు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి నిత్యం మంత్రాలు, గోత్రనామాలతో ఆమె పూజ చేస్తారు. ఆమె అత్త గుర్రమ్మ నుంచి వారసత్వంగా తీసుకుని ఆసాదిగా సేవలందిస్తున్నారు. ఈమె తర్వాత కోడలు దుర్గాభవానికి ఆసాది(పూజారమ్మ) బాధ్యతలు అప్పగించనున్నారు. కన్నమ్మ పేరంటాలు ఆలయం నిర్మాణానికి సాయిలక్ష్మి మామ శీరపు పాపారావు స్థలం ఇచ్చారు. అప్పటినుంచీ వంశపారంపర్యంగా ఈ కుటుంబం ఆసాదిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా.. గ్రామదేవత కన్నమ్మ పేరంటాలు దేవస్థానంలో ఆసాదిగా సేవలందించడం పూర్వజన్మసుకృతమని సాయిలక్ష్మి తెలిపారు.

కరాటే చాంపియన్.. డెలివరీ ఉమెన్



మాధవి

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన ఎస్.మాధవి కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించడమే కాకుండా జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచింది. ప్రేమ వివాహం చేసుకున్న ఆమె జీవితంలో ఎన్నో పాఠాలు, ఎత్తుపల్లాలు చూసింది. ఇద్దరు ఆడపిల్లలకు చదువు చెప్పించేందుకు కష్టాలు పడుతోంది. తన పిల్లలను ఉన్నతస్థాయిలో ఉంచాలనే సంకల్పంతో జీవితాన్ని ఈదేందుకు సిద్ధమైంది. ఆన్‌లైన్‌లో సరుకులు సరఫరా చేసే అమెజాన్‌లో డెలివరీ ఉమెన్‌గా పనిచేస్తోంది. ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తోంది. జాతీయస్థాయిలో బహుమతులు గెలిచే అవకాశం ఉన్న కరాటేలో పోటీ పడలేకపోతున్నందుకు ఆవేదన చెందుతోంది. ఎవరైనా ప్రోత్సాహమిస్తే కరాటేలో దేశానికి పతకాలు సాధిస్తానని విశ్వాసంతో చెబుతుంది.



సీఎం జగన్‌తో అన్నివర్గాల సంక్షేమం

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- గృహసారథులతో సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ధవళేశ్వరం: గృహసారథులు ప్రజలతో మమేకం కావాలని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ధవళేశ్వరం ఇండస్ట్రీయల్ కాలనీలోని గోలి దేవకుమార్ ఇంటి వద్ద మంగళవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై ఎప్పటికప్పుడు ప్రజలతో మాట్లాడుతూ ఉండాలన్నారు. ఏవైనా సమస్యలుంటే వలంటీర్‌కు తెలియపరచాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ముత్యాల పోసికుమార్‌ను ఘనంగా సన్మానించారు. సచివాలయ కన్వీనర్లు గోలి దేవకుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, బొడ్డేటి శివాజీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

చందనకు అభినందనలు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ గ్రీనరీఅండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను మంగళవారం రాత్రి ఆయన కార్యాలయంలో పలువురు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, కడియం, రూరల్ మండలాల జేసీఎస్ కన్వీనర్లు తాడాల విష్ణుచక్రవర్తి, తాటికొండ విష్ణు, కార్మిక నాయకుడు బత్రి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుళ్ల హైస్కూల్లో ఆకతాయిల విధ్వంసం



ధ్వంసమైన సరస్వతీదేవి విగ్రహం

కడియం: దుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి ఆకతాయిలు విధ్వంసం సృష్టించారు. సరస్వతీదేవి విగ్రహం చేతిని ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న సిమెంటు బెంచీలను విరగ్గొట్టారు. కొత్త భవనం నిర్మాణానికి తీసుకువచ్చిన ఇటుకలను చెల్లాచెదురుగా విసిరేశారు. విగ్రహాన్ని ఇటుకతో కొట్టిన ఆనవాళ్లు ఉన్నాయి. ఉదయం స్కూల్‌కు వచ్చిన ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించి, గ్రామ పెద్దలు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కడియం ఎస్ఐ ఆంజనేయులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఉపాధ్యాయుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా పాఠశాలలో రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పలువురు గ్రామస్తులు చెబుతున్నారు. మద్యం తదితర దుర్వసనాలకు అలవాటు పడిన వారు హైస్కూల్‌లో రాత్రిపూట వస్తున్నారంటున్నారు. ఇప్పటికే పలుమార్లు హైస్కూల్‌లో తాళాలు పగలగొట్టడం, లైట్లు బద్దలు గొట్టడం వంటివి చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేట్లకు తాళాలు వేసినప్పటికీ ఎత్తు తక్కువగా ఉన్న ప్రహరీ దూకి లోపలకు ప్రవేశిస్తున్నారన్నారు.

42 కేజీల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: అనకాపల్లి నుంచి కర్ణాటకకు కారులో తరలిస్తున్న 42 కిలోల గంజాయిని దివాన్ చెరువు జీరోపాయింట్ వద్ద మంగళవారం పట్టుకున్నారు. బొమ్మూరు ఎస్సై జగన్ మోహన్ రావు సిబ్బందితో తనిఖీ నిర్వహిస్తుండగా ఈ ఘటన జరిగింది. గంజాయిని తరలిస్తున్న కర్ణాటకకు చెందిన సోనీ సునీత, శశికాంత్ సోమిశెట్టిని పోలీసులు అరెస్టు చేశారు. కారు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 2.10 లక్షలు ఉంటుంది.

అన్నసమారాధన

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం శ్రీమాన్ ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో చక్రస్నానం జరిగింది. ఆలయంలో విశేష పూజలు జరిపించారు.

గ్లోబల్ సమ్మిట్ చారిత్రక ఘట్టం

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ధవళేశ్వరంలో సంబరాలు



చందన నాగేశ్వర్‌కు కేక్ తినిపిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ధవళేశ్వరం: విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ ఒక చారిత్రక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మంగళవారం సాయంత్రం ధవళేశ్వరం బ్యారేజ్ సెంటర్‌లో పార్టీ శ్రేణులతో విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమానికి చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ అభిమానులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర పరిస్థితిని వివరించి, ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి కారణం వివరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెద్ద ఎత్తున బడా పారిశ్రామిక వేత్తలను విశాఖ సమ్మిట్‌కు ఆహ్వానించారన్నారు. వైఎస్ జగన్‌పై నమ్మకంతో దిగ్గజాలు కదలిరావడం జరిగిందన్నారు. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 20 రంగాలలో పరిశ్రమలు తరలి రానున్నాయని, వీటి ద్వారా ఆరు లక్షల మందికి పైగా యువతకు ఉద్యోగ, ఉపాధి లభిస్తాయన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రం ఆర్థికంగా మరింత బలోపేతం కావడం తథ్యం అన్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తే.. ప్రతి పక్షాలు, వాటి అనుకూల మీడియా వ్యతిరేక ప్రచారం చేయడం ఎంత వరకూ సబబని ప్రశ్నించారు.

పాఠశాలకు గ్రంథాలయ పుస్తకాల వితరణ



గ్రంథాలయ పుస్తకావిష్కరణలో ఎంఈవో తులసీదాస్

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి వెంకటగిరి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రవాస భారతీయుడు జాస్తి శివరామకృష్ణ రూ.35 వేల విలువైన గ్రంథాలయ పుస్తకాలను వితరణ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని గ్రంథాలయాలను బలోపేతం చేసే లక్ష్యంతో ఆయన ప్రకాశం గ్లోబల్ ఎన్నారై ఫోరం (పీజీఎన్ఎఫ్), లెర్న్ అండ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వెంకటగిరి పాఠశాలకు 700 గ్రంథాలయ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో బుక్ ఫెయిర్ నిర్వహించి, గ్రంథాలయ పుస్తకాలను మండల విద్యాశాఖాధికారి తులసీదాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పుస్తకాలు అందించిన జాస్తి రామకృష్ణ, బీరువా అందించిన కాయల నరసింహారెడ్డికి ఉపాధ్యాయుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలకు పుస్తకాలు రావడానికి కృషిచేసిన ఉపాధ్యాయురాలు మాధవిని అభినందించారు. అలాగే విశ్రాంత మండల విద్యాశాఖాధికారి కాయల నరసింహారెడ్డి పాఠశాల గ్రంథాలయ పుస్తకాల నిర్వహణకు రూ.10 వేలు విలువైన బుక్ బీరువాను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న గిరజాల బాబు

కడియం: ప్రతి ఒక్కరు క్రీడల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జపాన్ షాటోకాన్ ఆధ్వర్యంలో జరిగిన కరాటే పోటీల్లో పలు పతకాలు సాధించిన విద్యార్థులను బాబు మంగళవారం స్థానిక హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. కే.లోకేష్, బి.ప్రియహాసిని, బి.భవ్యశ్రీ, నవీన్ కుమార్, మోహన్‌కృష్ణ ప్రసాద్, రామకిషోర్, వెంకట ఆదిత్య, రోహిత్, ఆదిత్య వివిధ కేటగిరీల్లో పతకాలు సాధించారు. వారిని, శిక్షణనిచ్చిన కె.జానకిరాముడును అభినందించారు. కార్యక్రమంలో వట్టికూటి బుల్లిబాబు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ

కంబాలచెరువు: మహిళలు అన్ని రంగాల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. నగర యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దిలీప్ కుమార్ మాట్లాడుతూ బాలికల విద్యతో సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. నగర యూటీఎఫ్ శాఖ అధ్యక్షులు రవిబాబు మాట్లాడారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.నరేష్, సహాధ్యక్షురాలు ఎంఎన్‌వీ లక్ష్మి, కార్యదర్శులు ఎం.శివలీల, ప్రసన్నేశ్వరి, కోశాధికారి తేజవిజయకుమార్, కార్యదర్శి జీవీవీ.సుబ్బారావు, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం అందరి బాధ్యత

కడియం: మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంఈవో వి.లజపతిరాయ్ అన్నారు. ఎస్టీయూ కడియం మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని స్థానిక ఎంఆర్సీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీఆర్డీఏ ఏపీఎం స్వర్ణలత, ఉపాధ్యాయురాలు లలితను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సబ్బతి శ్రీనివాస్, ఎం.లక్ష్మణరావు, వరలక్ష్మి, కోరాడ శివ, ఎండీ ఆలీ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయం

కంబాలచెరువు: మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించి, పలువురికి ఆదర్శప్రాయంగా నిలవాలని సీనియర్ సివిల్ జడ్జి, తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి అన్నారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ మహిళల హక్కులను కాపాడడం కోసం అనేక చట్టాలున్నాయన్నారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ

ప్రకాశం నగర్: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో మహిళా క్రీడాకారులకు శీతనబోయిన సాయిరామ్ క్రీడాకిట్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి సుంకర నాగేంద్ర కిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీరా గంగాధర్ మాట్లాడుతూ మార్చి 8 నుంచి 11 వరకు విశాఖపట్నంలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబేల్ రాజ్‌బాబు, రమణమూర్తి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

టీచర్‌కు సత్కారం

కంబాలచెరువు: పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ మన్ననలు పొందిన నన్నయ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు బి.జ్యోతిని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం సత్కరించారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బారావు, నగర యూటీఎఫ్ శాఖ అధ్యక్షుడు రవిబాబు, కార్యదర్శి నరేష్, కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాతేరు హైస్కూల్ సందర్శన

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. వాటిని ఉపాధ్యాయులు కరెక్షన్ చేస్తున్నారా, లేదా అనే అంశాలపై పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి విద్యార్థులతో మాట్లాడారు. హెచ్ఎం ఎం.సుజాత పాల్గొన్నారు.

వైభవంగా మహా హోమం

ప్రకాశం నగర్: కామాఖ్యామృత మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక సరస్వతీ ఘాట్‌లోని జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో శతరాజ శ్యామల సహిత మహాలక్ష్మి దశ మహా విద్య హోమాన్ని పండితులు ఘనంగా నిర్వహించారు. 300 మందికి పైగా భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతర మహోత్సవాలు

సీటీఆర్ఐ: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల పాత సోమాలమ్మ జాతర మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవ, ఉయ్యాల సేవలు నిర్వహించారు. గరగల నృత్యం, అఘోర నృత్యాలతో అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

లోన్‌యాప్ వేధింపులపై ఫిర్యాదు

కడియం: లోన్‌యాప్ నిర్వాహకులు వేధింపులకు గురిచేస్తున్నారంటూ కడియంలోని భాస్కరరామ్ నగర్‌కు చెందిన ఎస్.హరికృష్ణ పోలీస్‌లను ఆశ్రయించారు. అతడు 1800 లోన్ తీసుకోగా రూ.3,200 చెల్లించాలని మెసేజ్‌లు వచ్చాయి. ఆ అప్పు తీర్చడానికి మరో ఐదు లోన్ యాప్‌ల ద్వారా కూడా లోన్లు తీసుకున్నాడు. దీంతో మొత్తం రూ.1,35,000లు చెల్లించాలని వేధింపులు మొదలయ్యాయి. కట్టకపోవడంతో న్యూడ్ ఫోటోలను తమ కాంటాక్ట్స్‌కు షేర్ చేస్తున్నారని హరికృష్ణ తెలిపాడు. కడియం పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ధాన్యం కొనుగోలులో పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతకు వినతిపత్రం అందజేశారు. ధాన్యం కొనుగోలులో వస్తున్న ఇబ్బందులతో పాటు పాత బకాయిలు, కమీషన్ చెల్లించాలని, అలాగే టెక్నికల్ అసిస్టెంట్లను వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ గ్రాడ్యూయేట్స్‌ను నియమించాలని వినతిపత్రంలో కోరారు.

యువకుడి మృతి

కంబాలచెరువు: మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో పశ్చిమగోదావరి జిల్లా రేలంగికి చెందిన పసుపులేటి దుర్గాప్రసాద్ (20) మంగళవారం మృతి చెందాడు. అతడు పని నిమిత్తం సోమవారం సాయంత్రం రేలంగి నుంచి రాజమహేంద్రవరం వస్తున్నాడు. గోదావరి బ్రిడ్జిపైకి వచ్చేసరికి మోటారు సైకిల్ అదుపుతప్పి కింద పడిపోయాడు. వెంటనే 108లో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.